ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

జగిత్యాల
జిల్లా వార్తలు
1★★
ఆదివారం 4 మే 2025

పెద్దమ్మతల్లి జాతర

మల్లాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామంలోని నీలగిరి పెద్దమ్మ తల్లి జాతర ఉత్సవాలు శనివారం ఘనంగా కొనసాగుతున్నాయి. భక్తుల కొంగు బంగారంగా కొలువైన అమ్మ వారిని దర్శించుకోవడానికి మల్లాపూర్, మెట్‌పల్లి మండలలోని గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా టీపీసీసీ డెలిగేట్ సుజిత్‌రావుతో పాటు కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ వాకిటి సత్యంరెడ్డితో పాటు నాయకులు అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆదివారం జాతర వేడుకల్లో భాగంగా బోనాల పండుగను ఘనంగా నిర్వహిం చడం జరుగుతుందని నిర్వాహకులు తెలి పారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమ్ముల చిన్నారెడ్డి, రుత్త నారాయణ, గంధం రాజేశం, కల్లెడ గంగాధర్, ముది రాజ్ సంఘం, గ్రామాభివృద్ధి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కానరాని పర్యాటక శోభ
అభివృద్ధికి నోచుకోని కొండగట్టు
ప్రతిపాదన దశలోనే
నిలిచిన రోప్‌వే
కలగానే కోతుల పార్క్ 2

వైభవంగా నరసింహస్వామి
నవరాత్రోత్సవాలు ప్రారంభం

3

కొండగట్టులో భక్తుల రద్దీ 3

ఆరుతడి పంటలు అంతంతమాత్రమే..



- ఆసక్తి చూపని రైతులు
- ఏటా పెరుగుతున్న వరి సాగు విస్తీర్ణం
- విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం
- ఆందోళన వ్యక్తం చేస్తున్న నిపుణులు

జగిత్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆరుతడి పంటలకు ఆదరణ కరువవుతోంది. ఏడాదికేడాది వరి సాగు విస్తీర్ణం పెరుగుతోంది. మొత్తం పంటల సాగులో 75 శాతానికి పైగా వరి ఉండడం ప్రస్తుత పరిస్థితికి అద్దం పడుతోంది. వరి సాగు కారణంగా విద్యుత్ వినియోగం పెరగడంతో పాటు భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు ఆరుతడి పంటల సాగుపై అవగాహన కల్పించాలనే నిపుణులు సూచిస్తున్నారు. వచ్చే వానాకాలం సీజన్‌లోనూ ఆరుతడి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు కనిపించడం లేదు.

దక్కని మద్దతు ధర

ఆరుతడి పంటల సాగుపై రైతులు ఆసక్తి చూపడం లేదు. మరో వైపు వరి సాగు విస్తీర్ణం ఏడాదికేడాది పెరుగుతోంది. సన్న ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ప్రకటించడం, ఆరుతడి పంటలకు కనీస మద్దతు ధర లేకపోవడంతో అంచనాలను మించి వరి సాగవుతోంది. పంటల సాగులో భారీ అంతరం కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బ తినడమే కాకుండా ప్రభుత్వంపై ఆర్థికంగా పెనుభారం పడుతోంది. అంతేకాకుండా అపరాలు, నూనెగింజలు, కూరగాయల సాగు వేగంగా పడిపోయి దిగుమతులపై ఆధారపడి వాటి ధరలు పెరిగే అవకాశం ఉంది.

జిల్లాలో సాగు వివరాలు..

2024-25 వానాకాలం సీజన్‌లో 4,13,974 ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఇందులో 3,11,642 ఎకరాల్లో వరి పంట, మిగిలిన 1,02,332 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగు అయ్యాయి. 2025 యాసంగి సీజన్‌లో జిల్లాలో 3,88,550 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఇందులో 2,97,365 ఎకరాల్లో అంటే పూర్తి సాగులో అత్యధికంగా వరి పంట ఉండగా కేవలం 91,185 ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగయ్యాయి. ఏడాది వ్యవధిలోనే సుమారు పదకొండ వేల ఎకరాల ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం తగ్గిపోయింది. 2025-26 వానాకాలం సీజన్ పంటల ప్రణాళిక ఖరారుకాగా జిల్లా వ్యాప్తంగా 4,14,419 ఎకరాలకు పైగా పంటలు సాగవుతాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో అత్యధికంగా వరి 3,20,642 వరి ఎకరాల్లో సాగయ్యే అవకాశమున్నట్లు పేర్కొంది. ఈ లెక్కన ఆరుతడి పంటల సాగు విస్తీర్ణం పెరిగే అవకాశాలు కనిపించడం లేదు.

మద్దతు ధర పెంచాలి

వరి సాగుతో తాత్కాలిక ప్రయోజనాల కన్నా దీర్ఘకాలిక నష్టాలే ఎక్కువ అని రైతులకు అవగాహన కల్పించి ఆరుతడి పంటల సాగుకు కచ్చితమైన ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. అపరాలు, చిరుధాన్యాలు, నూనె గింజలు, మొక్కజొన్న, నువ్వు, గోధుమ పంటల సాగును ప్రోత్సహించేందుకు ప్రయత్నించాలి. ఆరు తడి పంట ఉత్పత్తుల మద్దతు ధరలను పెంచడమే కాకుండా సాగుకు అవసరమైన విత్తనాలు, సూక్ష్మ బిందు సేద్యం పరికరాలు, పంట మార్పిడి యంత్రాలను రైతులకు ఏటా రాయితీపై అందించాల్సి ఉంది. ఆరుతడి పంటల మిగతా 4వ పేజీలో



ప్రభుత్వం అవగాహన కల్పించాలి
బండారు వెంకటేశ్, రైతు, పెంబట్ల గ్రామం



జిల్లాలో ఆరుతడి పంటల సాగుకు అనుకూలమైన నేలలతో పాటు చక్కని వాతావరణ పరిస్థితులు ఉన్నాయి. అయినా రైతులు వరి సాగు వైపే మొగ్గు చూపుతున్నారు. వరి సాగుకు ప్రభుత్వం అనుకూలంగా వ్యవహరించడంతో ఆరుతడి పంటల సాగు వేగంగా పడిపోతోంది.

బోనస్ ఇవ్వాలి
కొక్కు గంగారాం, రైతు, సారంగాపూర్



కాలువలు లేని గ్రామాల్లో నీటి లభ్యత తక్కువగా ఉంటుంది. అందువల్ల మా గ్రామంలో వరి సాగు కుదరక ఎక్కువగా పత్తి, మొక్కజొన్న సోయా వంటి ఆరుతడి పంటలనే సాగు చేస్తాం. ప్రభుత్వం ఆరుతడి పంటలను చిన్నచూపు చూడటంతో గిట్టుబాటు కావడం లేదు. ఆరుతడి పంటల ఉత్పత్తులపై రైతులకు బోనస్ చెల్లించి చేయూత నివ్వాలి.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై ఎమ్మెల్యే సమీక్ష


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, మే (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ ప్రక్రియ, ఆశావహులు, లబ్ధిదారుల సమస్యలు తదితర అంశాలపై జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను అందించే బాధ్యత అధికారులదన్నారు. ప్రభుత్వం పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మదన్మోహన్, మున్సిపల్ కమిషనర్ స్పందన, గృహ నిర్మాణ శాఖ అధికారి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

జగిత్యాల అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లా కోర్టులోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శనివారం ఇటీవల ఎంపికయిన బార్ అసోసియేషన్ కార్యవర్గం ఆహ్వానం మేరకు జిల్లా కోర్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు జిల్లా కోర్టులో అవసరమైన మౌలిక సదుపాయాలు, నూతన కోర్టు హాల్, నూతన పోస్టులు, అడ్వకేట్ల సమస్యలపై విన్నవించగా అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో బార్ అసోసియేషన్ నాయకులు, అడ్వకేట్లు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

కోరుట్ల రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామ జిల్లా పరిషత్ పాఠశాలలో 2005-06లో పదవ తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అపూర్వ సమేళనంగా ఏర్పడ్డారు. పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు కోరుట్ల పట్టణ శివారులోని ఓ కళ్యాణ భవనంలో కలుసుకొని జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. వారికి విద్యా బోధనలు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడంతో కళ్యాణ భవనం సందడిగా మారింది.

పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

జగిత్యాలరూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలని అధికారులు పూర్ణచందర్, గంగాధర్, విశాల్, నరేష్ సూచించారు. జగిత్యాల రూరల్ మండలం పొరండ్ల గ్రామంలో పశువులకు ఉచిత గాలికుటంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈసందర్భంగా గ్రామంలో 135 తెల్లజాతి పశువులకు, 255 గేదెలకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి ప్రాణాంతకమైందన్నారు. పాడి పశువులు కలిగిఉన్న యజమానులు గాలికుంటువ్యాధి టీకాలు వేయించాలని అధికారులు సూచించారు. ఈకార్యక్రమంలో అధికారులు పూర్ణచందర్, గంగాధర్, విశాల్, నరేష్, సిబ్బంది వెంకటమ్మ గంగయ్య రాములు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి

కొడిమ్యాల, మే3(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్ళను త్వరగా పూర్తి చేయాలని జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌గౌడ్ ఆదేశిం చారు. శనివారం మండలంలోని నల్లగొండ గ్రామంలో నిర్వహిస్తున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ధాన్యాన్ని ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో నమోదు చేయాలన్నారు. లోడ్ చేసిన ధాన్యాన్ని మిల్లుకు తరలించాన్నారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ జి. రమేష్, ఆర్.ఐ కరుణాకర్ ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై చర్యలు


వాహనాలు తనిఖీ చేస్తున్న సీఐ సురేష్‌బాబు

కోరుట్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చట్టపరమైన చర్యలు తప్పవని కోరుట్ల సీఐ సురేష్ బాబు హెచ్చరించారు. శనివారం పట్టణంలో జిల్లా ఎస్పీ అశోక్‌బాబు ఆదేశాల మేరకు పట్టణంలోని నంది, కార్గిల్, కొత్త బస్టాండ్, కల్లూర్, మాదాపూర్ రోడ్డులో కోరుట్ల సీఐ సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీకాంత్, రామచంద్రుడు వారి సిబ్బందితో ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వాహనాల తనిఖీని నిర్వహించారు.

ఈ సందర్భంగా ధ్రువీకరణ పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. మద్యం తాగి వాహనాలను నడిపిన వారి వివరాలను సేకరించి వారి వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. మైనర్లు నడుపుతున్న వాహనాలను స్వాధీనం చేసుకొని వారి తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు రావాలని ఫోన్ ద్వారా సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల పోలీసులు పాల్గొన్నారు.

'క్రీడా శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి'


మాట్లాడుతున్న మెట్‌పల్లి ఎంఈవో చంద్రశేఖర్

మెట్‌పల్లిటౌన్, మే 3 (ఆంధ్రజ్యోతి): వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మెట్‌పల్లి మండల విద్యాధికారి మేకల చంద్రశేఖర్ కోరారు. శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాల తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యాధికారి మాట్లాడుతూ .15 రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరాలలో గణిత, ఆంగ్లం, చిత్రలేఖనము, క్రీడలు, కుట్లు, అల్లికలు, పాలిగ్రఫీ లాంటి వివిధ అంశాల్లో శిక్షణను ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండ్లెపు నారాయణ, ఇంద్రాల రామేశ్వర్,తులసి ఆగమయ్య, తదితరులు పాల్గొన్నారు.

●వెల్గటూర్: వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని మండల విద్యాధికారి ప్రభాకర్ శనివారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కోచ్ కాంపెల్లి మహేష్ ఆధ్వర్యంలో నిర్వహించే వాలీ బాల్ శిక్షణలో బాల బాలికలు మెళకువలు నేర్చుకుని మంచి క్రీడాకారులుగా ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నీలం సంపత్ కుమార్, నక్క సురేష్, సీఆర్పీ వెంకటేష్ పాల్గొన్నారు.

●మండలంలోని పాషిగామ ప్రాథమిక పాఠశాల, వెల్గటూర్, చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సమ్మర్ క్యాంప్‌లను ఎంఈవో ప్రభాకర్, పాషిగామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నీలం సంపత్ కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ వెంకటేష్, పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా బుగ్గారం ఎంపిక

- ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్

జగిత్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూ భారతి పైలట్ ప్రాజెక్టుగా బుగ్గారం మండలాన్ని ప్రభుత్వం ఎంపిక చేశామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. శనివారం పట్టణంలోని మెడికల్ కళాశాల గెస్ట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ధరణి కారణంగా ఎంతో మంది రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ధరణి సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో భూ భారతి చట్టం అమలు చేయడం జరుగుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దరణి చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అట్టి చట్టాన్ని రద్దు చేసి భూ భారతి చట్టాన్ని అంబేద్కర్ జయంతి సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అమలును ప్రారంభించారన్నారు. ధర్మపురి నియోజకవర్గంలోని స్తంభంపల్లిలో మంజూరు అయిన అగ్రికల్చర్ కళాశాలను ఇతర జిల్లాకు తరలిస్తున్నారని ఇటీవల మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అసత్యపు ప్రచారాలు చేస్తున్నారని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సిద్దిపేటకు మంజూరు అయిన కళాశాలను జగిత్యాలకు మంజూరు అయిన విధంగా ప్రజలను తప్పుతోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో పలువురు ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

రేపు మంత్రి సీతక్క రాక..

పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లిలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క రానున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. కీచులాటపల్లిలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలను మంత్రి సీతక్క నిర్వహించనున్నారన్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను చేస్తున్నామని ఆయన తెలిపారు.

●సభ ఏర్పాట్ల పరిశీలన

పెగడపల్లి: పెగడపల్లి మండలంలో సోమవారం పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పర్యటించనున్నట్లు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. మండలంలోని కీచులాటపల్లి నుండి మల్లాపూర్ ఎక్స్ రోడ్డు వరకు రూ. 8 కోట్ల 20 లక్షలతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులతో పాటు మండలంలో రూ.20 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయడానికి మంత్రి సీతక్క కీచులాటపల్లికి రానున్నట్లు లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు కీచులాటపల్లి గ్రామంలో సభా నిర్వహణకు, పనుల శంఖుస్థాపన కార్యక్రమాలకు ఏర్పాట్ల పరిశీలనకు గాను లక్ష్మణ్ కుమార్ శనివారం సాయంత్రం అధికారులు, మండల నాయకులతో కలసి పరిశీలించారు. మండల పార్టీ నాయకులు , కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలివచ్చి మంత్రి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, మాజీ జడ్పీటీసీ కాసుగంటి రాజేందర్ రావు, నాయకులు ఒరుగల శ్రీనివాస్, సంధి మల్లారెడ్డి, కడారి తిరుపతి, చెట్ల కిషన్, ఆకుల విష్ణు పాల్గొన్నారు.

నీట్‌కు సర్వం సిద్ధం..

-నేడు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు పరీక్ష
-జిల్లాలో హాజరుకానున్న 768 మంది విద్యార్థులు

జగిత్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్-2025)ను జిల్లాలో ఆదివారం మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5వరకు నిర్వహించ డానికి అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. పరీక్ష నిర్వహణపై కలెక్టర్ సత్యప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంబీబీఎస్‌తో పాటు బీడీఎస్, బీఎస్, ఎంఎస్, బీయూఎంఎస్, బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే ఈ పరీక్ష కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) అడ్మిట్ కార్డులను విడుదల చేసింది. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు నీట్ యూజీ అధికారిక వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్, సెక్యూరిటీ పిన్ సహాయంతో అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

●జిల్లాలో రెండు సెంటర్లు

జిల్లాలో నీట్ నిర్వహణకు రెండు సెంటర్లను కేటాయించారు. జిల్లాలోని కొడిమ్యాల మండలం నాచుపల్లి, మల్యాల మండలం కొండగట్టు శివారులో గల జేఎన్‌టీయూ కళాశాలలో రెండు కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 768మంది విద్యార్థులు పరీక్ష రాయనుండగా ప్రభుత్వ జెఎన్‌టీయూ కొండగట్టు కళాశాల సెంటర్-1లో 480 మంది, సెంటర్-2లో 288 మంది విద్యార్థులను కేటాయించారు. కలెక్టర్ సత్యప్రసాద్ పర్యవేక్షణలో డాక్టర్ జగదీశ్ కుమార్, డాక్టర్ సురేశ్ శ్రీపాదలను ఇరువురు చీఫ్ సూపరింటెండెంట్స్ ఆధ్వర్యంలో 68 మంది ఇన్విజిలేటర్లు నీట్ విధులు నిర్వర్తించనున్నారు. జగిత్యాల పట్టణంలోని పికప్ పాయింట్ వద్ద స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్‌లో ఒక స్ట్రాంగ్ రూమ్‌ను, కెనెరా బ్యాంక్‌లో మరొక స్ట్రాంగ్ రూమ్‌ను ఎంపిక చేశారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘాను ఉంచారు. ఎస్పీ అశోక్ కుమార్ నేతృత్వంలో మూడంచెల భద్రత ఏర్పాటు చేయనున్నారు. ఎన్‌టీఏ, జిల్లా అబ్జర్వర్ల పర్యవేక్షణ ఉంటుంది.


నీట్ కేంద్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

●సీసీ కెమెరాల నిఘా..

ఎన్‌టీఏ పర్యవేక్షణలో సీసీ కెమెరాల నిఘా మధ్య మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు పరీక్ష నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల లోపు వచ్చిన విద్యార్థులను మాత్రమే సెంటర్‌లోకి అనుమతిస్తారు. అడ్మిట్ కార్డు, ఐడీ కార్డు తప్పనిసరిగా వెంట తెచ్చుకోవాలి. విద్యార్థులు సెంటర్‌లోకి వెళ్లిన తర్వాత బయోమెట్రిక్ వెరిఫికేషన్ నిర్వహించనున్నారు.

●వీటికి అనుమతి లేదు..

పరీక్ష కేంద్రంలోకి డిజిటల్, ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్‌ఫోన్, ఎలక్ట్రానిక్, ఇతర వాచ్‌లు, ఆభరణాలకు అనుమతి లేదు. పరీక్ష సమయంలో ఇన్విజిలేటర్ల బాధ్యతలు, విధులపై సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ల ఆధ్వర్యంలో అవగాహన కల్పించడంతో పాటు, ఐడీ కార్డులు అందజేశారు.

పకడ్బందీ ఏర్పాట్లు
-సత్యప్రసాద్, కలెక్టర్

జిల్లాలో నీట్ పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశాం. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్ష ఉంటుంది. విద్యార్థులు మధ్యాహ్నం 1.30 గంటల లోపు హాజరు కావాల్సి ఉంటుంది. ఆ తర్వాత వచ్చిన వారిని లోనికి అనుమతించరు. అడ్మిట్, ఐడీకార్డులు లేకుంటే పరీక్షకు అనుమతించం.

ఏర్పాట్లను పర్యవేక్షించిన కలెక్టర్

కొడిమ్యాల: మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ కళాశాలలో జరగనున్న రెండు పరీక్ష కేంద్రాలను శనివారం కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీఓ మధుసూదన్, తహసీల్దార్ రమేశ్, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ రమేష్

కోల్‌సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్‌చేసినట్లు ఏసీపీ ఎం రమేష్ తెలిపారు. శనివారం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులసమావేశంలో వివరాలను వెల్లడించారు. ప్రశాంత్ నగర్‌కు చెందిన చీమల తిరుపతి, రాగుల రాజశేఖర్, బోనగిరి రాకేష్‌లకు నేర చరిత్ర ఉందన్నారు. 2021లో ప్రశాంత్‌నగర్‌కు చెందిన బండారి మొగిలి హత్య కేసులో వీరు నిందితులు. ఈకేసు ప్రస్తుతం ట్రయల్‌కు వచ్చిందన్నారు. రాకేష్, రాజశేఖర్‌లు కేసు రాజీ చేసుకుందామని ప్రధాన నిందితుడు చీమల తిరుపతితో సంప్రదిస్తే రాజీ అవసరం లేదని, కేసు కొట్టుడు పోతుందంటూ దాట వేశాడన్నారు. ఈ విషయంలో ముగ్గురి మధ్య విభేదాలు తలెత్తాయని, మూడు రోజులుగా మాట్లాడుదామని పిలిచినా తిరుపతి స్పందించలేదని, కేసులో శిక్ష పడితే కుటుంబాలు రోడ్డున పడుతాయని ఇద్దరు నిందితులు తిరుపతికి నచ్చజెప్పినా అతను ఒప్పుకోలేదన్నారు. ఈక్రమంలో శుక్రవారం తిరుపతి నిర్వహిస్తున్న ఎస్ఎం ఆన్‌లైన్‌సెంటర్‌కు వచ్చిన నిందితులు అతనిపై కత్తులతో దాడిచేశారని తెలిపారు. నిందితులిద్దరిని గోదావరి సమీపంలోని సమ్మక్కసారలమ్మ గద్దెలవద్ద అరెస్టుచేశామని, వారినుంచి బైక్‌కత్తులు స్వాధీనపర్చుకున్నామన్నారు. విలేకరుల సమావేశంలో సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ భూమేష్, హెడ్‌కానిస్టేబుళ్లు సదానందం పాల్గొన్నారు.

పాముకాటుతో వృద్ధురాలి మృతి



రాజమ్మ(ఫైల్)

ఓదెల, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన గాండ్ల రాజమ్మ(70) అనే వృద్ధురాలు పాము కాటుకు గురై మృతి చెందింది. శుక్రవారం రాత్రి ఇంటిపనులు చేస్తుండగా పాము కాటు వేయడంతో అస్వస్థతకు గురైంది. దీంతో కుటుంబ సభ్యులు సుల్తానాబాద్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. మృతురాలి కుమారుడు గాండ్ల సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పొత్కపల్లి ఎస్ఐ రమేష్ తెలిపారు.

కానరాని పర్యాటక శోభ

- అభివృద్ధికి నోచుకోని కొండగట్టు
- ప్రతిపాదన దశలోనే నిలిచిన రోప్‌వే
- కలగానే కోతుల పార్క్



కొండగట్టు అంజన్న ఆలయం

మల్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎత్తైన గుట్టలు.. వందలాది ఎకరాల భూములు.. పచ్చని చెట్లు.. మైమరిపించే అందాలు.. అన్నింటికీ మించి కోతుల కిచకిచలు... ఇవి కొండగట్టు ఆంజనేయ స్వామి దేవస్థానం ప్రత్యేకత. కానీ పర్యాటకంగా అభివృద్ధి మాత్రం ఇక్కడ కనిపించదు. కొండగట్టు పుణ్య క్షేత్రానికి నిత్యం వేలాదిగా, హనుమాన్ జయంతి ఉత్సవాల సందర్భంగా లక్షలాదిగా భక్తులు తరలి వస్తారు. కొండగట్టు ప్రాంతం పర్యాటకంగా అన్ని విధాల ఎంతో అనుకూలం అయినప్పటికీ అభివృద్ధికి దూరంగా ఉండటం పట్ల ఈ ప్రాంతవాసులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దడంపై అధికారులు, పాలకవర్గం పట్టించుకోవడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండగట్టును పర్యాటకంగా అభివృద్ధి పరుస్తామని హామీలు ఇచ్చిన నేతల మాటలు నీటిమూటలు అవుతున్నాయి. కొండగట్టును పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రోప్‌వే ప్రతిపాదిత స్థలం

పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితం

కొండగట్టులో రోప్‌వే ఏర్పాటు పదేళ్లుగా ప్రతిపాదన దశలోనే మిగిలిపోయింది. మెట్లదారి నుంచి ప్రస్తుత పుష్కరిణి వెనుక వైపు వరకు తాడు మార్గం (రోప్ వే)కు అప్పట్లో రెవెన్యూ అధికారులు స్థల పరిశీలన కూడా చేశారు. పర్యాటక శాఖ అధికారుల సైతం పలుమార్లు కొండగట్టును సందర్శించి రోప్‌వే కోసం పరిశీలన జరిపారు. రెవెన్యూ అధికారులు సుమారు 12 ఎకరాల మేర స్థలం కూడా కేటాయించారు. తదనంతరం దాని ఊసే లేకుండా పోయింది. రోప్ వే అయితే ఇక్కడ పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందే అవకాశం ఉన్నా దానిని పట్టించుకునే వారే కరువయ్యారు.

అమలుకు నోచుకోని హామీలు

కొండపైన కోతుల పార్క్ ఏర్పాటు చేయడం వలన వాటి సంరక్షణ, పెంపు తదితర అవకాశాలు ఉండగా అది అమలుకు ఆమడ దూరంలో ఉంది. ఆంజనేయ స్వామి ప్రతిరూపంగా కొండగట్టు దేవస్థానానికి వచ్చే భక్తులను విశేషంగా ఆకర్షించే కోతుల సంరక్షణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో వీటి ఉనికి ప్రశ్నార్థంగా మారుతోంది. ఆహార అన్వేషణలో కొండ దిగి కరీంనగర్-జగిత్యాల ప్రధాన రహదారిపై సంచరిస్తున్న కోతులు తరచుగా భారీ వాహనాల కింద పడి మరణిస్తున్నాయి. కొండగట్టు దేవస్థానం పరిధిలో గల కనీసం 200 ఎకరాలు భూమి కోతుల పార్క్ కోసం అవసరముండగా ఇందుకు కావాల్సిన నివేదికను అటవీ శాఖతో పాటు జంతు ప్రదర్శన (పర్యావరణ) శాఖ అధికారులు తయారు చేయాల్సి ఉంటుంది. అయితే సమన్వయ లోపం, దేవాదాయ శాఖ, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంతో కోతుల పార్క్ కలగానే మిగులుతోంది.



నమూనా రోప్‌వే

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



మృతిచెందిన వృద్ధుడు

కరీంనగర్ క్రైం, మే 3 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తుతెలియని వృద్ధుడు(60) శుక్రవారంరాత్రి మృతి చెందాడని అవుట్‌పోస్ట్ హెడ్‌కానిస్టేబుల్ ప్రభాకర్‌తెలిపారు. కరీంనగర్ కమాన్‌వద్ద అనారోగ్యంతో రోడ్డుపక్కన పడిఉన్న వృద్ధుడిని గతనెల25న 108అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి చికిత్స అందిస్తుండగా వృద్ధుడు మృతిచెందినట్లు తెలిపారు.మృతుడిని గుర్తించినవారు రెండోఠాణా, అవుట్‌పోస్ట్‌పోలీసులను సంప్రదించాలని కోరారు. వృద్ధుడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు.

పుస్తెల తాడు ఇవ్వనందుకు భార్య హత్య

- నిందితుడి అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రఘుచందర్

కొడిమ్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): అప్పులు తీర్చడానికి భార్య మెడలోని బంగారుపుస్తెల తాడు అడిగితే ఇవ్వలేదని కొడిమ్యాలకు చెందిన అవుదుర్తి మమతను ఆమె భర్త అవుదుర్తి మహేందర్ ఉరివేసి హత్య చేశాడని జగిత్యాల డీఎస్పీ రఘుచందర్ తెలిపారు. శనివారం కొడిమ్యాల పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ మండల కేంద్రానికి చెందిన అవుదుర్తి మహేందర్‌కు మమతతో 20 సంవత్సరాలక్రితం వివాహం జరిగిందన్నారు. వీరిద్దరికి సంతానం లేకపోవటం, కుటుంబంలో ఆర్థిక పరమైన విషయాల్లో గొడవలు జరుగుతున్నాయన్నారు. సంతానం లేకపోవటంతో మహేందర్ తాగుడుకు బానిసై అప్పుల పాలయ్యాడన్నారు. నిందితుడు ఏ పని చేయక పోవటంతో మమత షాపింగ్‌మాల్‌లో పనిచేసేదన్నారు. భార్య ఉద్యోగం చేయగా వచ్చే డబ్బులను నిందితుడు తీసుకునేవాడని డీఎస్పీ వెల్లడించారు. కొద్దిరోజుల క్రితం బంగారు పుస్తెల తాడు ఇవ్వాలని అడుగగా మమత నిరాకరించిందన్నారు. భార్యను చంపితే పుస్తెల తాడు తీసుకోవచ్చునని పథకం వేశాడని డీఎస్పీ తెలిపారు. గత నెల 26న వేములవాడ, నల్లగొండ దైవ దర్శనాలకు వెళ్దామని నమ్మించి దర్శనాల అనంతరం మమతను మహేందర్ కొడిమ్యాలలోని ఇంటికి తీసుకువచ్చాడన్నారు. అనంతరం భార్య మెడ చుట్టు నైలాన్ తాడుతో ఉరి పెట్టి హత్య చేశాడన్నారు. ఆత్మహత్య చేసుకున్నట్లుగా నమ్మించేందుకు నైలాన్ తాడును ఇంటి స్లాబ్ హుక్‌కు కట్టాడన్నారు. అనంతరం పుస్తెల తాడు తీసుకొని గోల్డ్ లోన్ పెట్టి అప్పులను తీర్చుకున్నాడని డీఎస్పీ తెలిపారు. శనివారం మోటారు సైకిల్‌పై పారిపోతుండగా మండలంలోని చెప్యాల ఎక్స్ రోడ్డు వద్ద పట్టుకున్నామన్నారు. మృతురాలి తల్లి రాచకొండ పద్మ ఫిర్యాదు మేరకు మహేందర్‌పై హత్య కేసు, మహేందర్ కుటుంబ సభ్యులపై వరకట్నం వేధింపుల కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. నిందితుని వద్ద మోటార్‌సైకిల్, సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల ఎస్సై ఎస్. సందీప్, హెడ్ కానిస్టేబుల్ కనకయ్య ఉన్నారు.

కల్వచర్లలో మహిళ దారుణ హత్య



సమ్మక్క(ఫైల్)

రామగిరి, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని కౌండిన్యనగర్‌లో శుక్రవారం అర్ధరాత్రి మోటం సమ్మక్క(30) అనే మహిళ హత్యకు గురైంది. మంచిర్యాలజిల్లా తాండూరు ఐబీకాలనీ సమీపంలో పత్తి కనకరాజు అనే వ్యక్తితో సమ్మక్క కొన్నేళ్లుగా సహజీవనం చేస్తోంది. స్క్రాప్ వ్యాపారం చేస్తున్న వీరు తాండూరులో వ్యాపారం సజావుగా కొనసాగడం లేదని రెండు రోజులక్రితం కల్వచర్లలో ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చారు. వ్యాపారంలో భాగంగా శుక్రవారం మంథని, కాటారం ప్రాంతంలో పర్యటించి రాత్రి కల్వచర్లకు చేరుకున్నారు. అప్పటికే మద్యం సేవించి ఉన్న వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మద్యం మత్తులో ఆవేశంతో కనకరాజు అక్కడే ఉన్న సిమెంట్ బ్రిక్స్‌తో సమ్మక్క తలపై దాడి చేశాడు. ఈఘటనలో సమ్మక్క అక్కడిక్కడే మృతిచెందింది. అనంతరం కనకరాజు అక్కడినుంచి పరారయ్యాడు. కాగా మోటం సమ్మక్కకు గతంలో వివాహం జరగగా అనారోగ్య కారణంగా భర్త మృతి చెందాడు. మృతురాలికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. కనకరాజుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. సమ్మక్క తమ్ముడు తూర్పాటి మహేష్ ఫిర్యాదుమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మామిడిచెట్టుపై నుంచి పడి వృద్ధుడి మృతి

కోల్‌సిటీ, మే 3 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని చంద్రశేఖర్‌నగర్‌కు చెందిన నాగవెల్లి బాలయ్య(70) అనే వృద్ధుడు శనివారం ఇంటి ఆవరణలోని మామిడిచెట్టు ఎక్కి కాయలు తెంపుతుండగా జారి కింద పడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. అతని పరిస్థితి విషమించడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించాడు. అతని భార్య సుగుణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ కే రమేష్ పేర్కొన్నారు.

మరణంలో కూడా ఇద్దరికి చూపునిచ్చిన మహిళ



వినోద(ఫైల్)

సైదాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఓ తల్లి మృతి చెందుతూ తన నేత్రాలను దానం చేసి ఇద్దరు అంధులకు చూపునిచ్చింది. ఆ తల్లి మృతిచెందిన నేత్రాలు మాత్రం చూస్తూనే ఉంటాయి. సైదాపూర్ మండలంలోని ఆకునూర్ గ్రామానికి చెందిన మద్దూరి వినోద (65) అనారోగ్యంతో మృతిచెందగా వారి కుమారుడు రాంచంద్రారెడ్డి, కూతుళ్లు, అల్లుళ్లు రమ-సంపత్ రెడ్డి, స్వప్న-పతీష్‌రెడ్డి, కుటుంబ సభ్యులు ఆమె నేత్రాలను దానం చేశారు. దీంతో వరంగల్ ప్రాంతీయనేత్ర వైద్యశాలలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర టెక్నీషియన్ లక్ష్మన్ నేత్రాలను సేకరించారు. మృతురాలు నేత్రదానంద్వారా ఇద్దరు అందులకు చూపురావడమే కాకుండా నేత్ర వైద్యవిద్యకు ఉపయోగ పడిందని తెలంగాణ నేత్ర, అవయవ, శరీరదాతల అసోసియేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్రఅసోసియేషన్ వరంగల్‌జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి, హన్మకొండ జిల్లా ప్రధానకార్యదర్శి జనార్దన్, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బాలుడి ప్రాణం మీదికి తెచ్చిన కోడిగుడ్డు

- ప్రాణాలు కాపాడిన 108టెక్నీషియన్



అస్వస్థతకు గురైన బాలుడితో తల్లిదండ్రులు

పాలకుర్తి, మే 3 (ఆంధ్రజ్యోతి): యేడాది వయసు ఉన్న బాలుడు.. గొంతులో కోడి గుడ్డు ఇరుక్కుపోయి ఊపిరాడక ఇబ్బంది పడ్డాడు. ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న బాలుడికి 108సిబ్బంది చికిత్సఅందించారు. వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లిజిల్లా పాలకుర్తిమండలం రాణాపూర్ గ్రామానికి చెందిన రాజేష్-అశ్విని దంపతుల కుమారుడు శ్రేయాన్స్(1) వంటగదిలోని పాత్రలో ఉన్న గుడ్డును నోట్లో వేసుకున్నాడు. అదికాస్త గొంతులో ఇరుక్కుపోయి ఊపిరాడని పరిస్థితి ఏర్పడింది. దీంతో దిక్కుతోచని బాలుడి కుటుంబసభ్యులు హుటాహుటినపెద్దపల్లి ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. శ్రేయాన్స్‌ను పరీక్షించిన వైద్యులు కరీంనగర్‌తీసుకెళ్లాలని సూచించారు. 108లో కరీంనగర్‌కు తరలిస్తుండగా బాలుడి పరిస్థితి విషమంగా మారింది. మార్గమధ్యలో 108టెక్నీషియన్ భానుప్రసాద్ బాలుడికి చౌకింగ్‌చేసి ప్రాణాపాయస్థితి నుంచి కాపాడాడు. బాలుడిని బ్యాక్‌స్లాబ్స్‌తో ఫుడ్‌పార్టికల్స్(వాంప్టింగ్)ద్వారా గుడ్డును బయటికి రప్పించడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు. తల్లి దండ్రులు, కుటుంబసభ్యులు108టెక్నీషియన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా మట్టి రవాణా..
వాహనాలను సీజ్ చేసిన అధికారులు



పోలీస్‌స్టేషన్‌కు తరలించిన ఎక్స్‌కావేటర్

గన్నేరువరం, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా కెనాల్ మట్టిని తరలిస్తున్న ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్ఐ తాండ్రనరేష్ తెలిపారు. మండలంలోని గునుకుల కొండాపూర్ శివారులోని మిడ్‌మానేరు వరదకెనాల్ మట్టిని గునుకుల కొండాపూర్‌కు చెందిన గూడెల్లి నరేష్, జనగామ అనిల్, బూట్ల సతీష్ అక్రమంగా తరలిస్తున్నారన్న స్థానికుల సమాచారం మేరకు శుక్రవారం రాత్రి ఆ ప్రదేశానికి వెళ్లి ఎక్స్‌కావేటర్, రెండు ట్రాక్టర్లను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇరిగేషన్ ఏఈ మహేందర్ ఫిర్యాదు మేరకు వాహనాలను సీజ్‌చేసి యజమానులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా ఎవరైనా మట్టిని తరలిస్తే స్థానికులు తమ దృష్టికి తీసుకరావాలని ఇరిగేషన్ ఏఈ మహేందర్ సూచించారు.

ఆదివాసుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర ప్రభుత్వం

- ప్రభుత్వం బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలి
- శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్



మాట్లాడుతున్న హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

జమ్మికుంట, మే 3 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో ప్రభుత్వం ఏ పని చేపట్టాలనుకున్నా వారి నిర్ణయానికి వ్యతిరేకంగా చేసే అధికారం లేదని శాంతిచర్చల కమిటీచైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. వాటిని స్వయంగా ప్రభుత్వమే ఉల్లంఘిస్తూ ఆదివాసుల హక్కులకు విఘాతం కలిగించటం ప్రజాస్వామ్యబద్ధం కాదన్నారు. శనివారం జమ్మికుంట పట్టణంలోని వినాయక గార్డెన్‌లో శాంతిచర్చలను కోరుతూ మానవ హక్కుల వేదిక రాష్ట్రప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ తిరుపతయ్య అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి చంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలన్నారు. రాజ్యాంగం ప్రజలందరికీ గౌరవప్రదమైన జీవించే హక్కును కల్పించిందన్నారు. ఇది ఆదివాసులకు, మావోయిస్టులకు, పోలీస్‌వారికి అందరికీ వర్తిస్తుందన్నారు. తాము శాంతి చర్చల కమిటీగా ఏర్పడి మావోయిస్టులకు, కేంద్ర ప్రభుత్వానికి హింసను వీడనాడాలని విజ్ఞప్తి చేశామన్నారు. మావోయిస్టులు తుపాకులు వినియోగించమని, చర్చల ద్వారా శాంతి ఏర్పడటానికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారన్నారు. నెలరోజుల నుంచి వారు దానికి కట్టుబడి ఉంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం వారిని చుట్టుముట్టి చంపివేయడానికి మరిన్ని బలగాలను పంపడం ఏ రకంగాను ధర్మం కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి వెంటనే కాల్పుల విరమణ ప్రకటించి, బేషరతుగా మావోయిస్టులతో చర్చలు జరపాలన్నారు. చర్చల సమయంలో ఏ రకమైన షరతులైనా పెట్టవచ్చని, కానీ చర్చలకు ముందు షరతులు పెట్టడం భావ్యం కాదన్నారు. కర్రె గుట్టల్లో, ఛత్తీస్‌గఢ్‌లో మోహరించిన బలగాలను.. మావోయిస్టులను చంపటానికి పంపకూడదని అన్నారు. చర్చల ప్రక్రియను ప్రారంభించాలని, అందుకోసం ప్రజలు, ప్రజాస్వామిక వాదులు తమ గొంతు విప్పాలన్నారు. అన్నిరాజకీయ పార్టీలు సైతం వాటి రాజకీయ వైఖరీకు అతీతంగా సమస్యను శాంతియుతంగా మానవీయ మార్గంలో పరిష్కరించడానికి తమవంతుగా కృషి చేయాలన్నారు.

కార్యక్రమంలో దేశిని కోటి, మొలుగూరి సదయ్య, పింగిలి రమేష్, తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావు, పోడేటి రామస్వామి, కనుమల్ల విజయ, మిలుకూరి వాసుదేవరెడ్డి, బదావత్ రాజు, టి హరికృష్ణ, పందిళ్ల రంజిత్‌కుమార్, గుంటి సామ్రాజ్యం, మోహన్, దొడ్డె సమ్మయ్య, ఆవాల నరహరి, పుల్లూరి సంపత్‌రావు, రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల నాయకులు, ఉద్యోగులు, తదితరులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

బాలభవన్ శిక్షణ తరగతులకు స్పందన



సంగీతం నేర్చుకుంటున్న విద్యార్థులు

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్, విద్యాశాఖ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో నిర్వహిస్తున్న బాల భవన్ వేసవి శిక్షణ తరగతులకు మంచి స్పందన లభిస్తోంది. అబాకస్, శాస్త్రీయ నృత్యం, యోగా, చెస్, మృదంగం, నృత్యం, సంగీతం, మెహందీ, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్, డ్రాయింగ్ విభాగాలతో పాటు ఈ యేడు కర్రసాములోకూడా శిక్షణ ఇస్తున్నారు. జూన్ 10వ తేదీ వరకు అంశాల వారీగా శిక్షణ ప్రతీరోజూ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగనుంది. ఏప్రిల్ 1వ తేదీ నుంచి మే 3 వరకు నమోదై దరఖాస్తులు చేసుకున్న 617 మంది విద్యార్థులు ప్రస్తుతం వివిధ అంశాల్లో శిక్షణ పొందుతున్నారని బాలభవన్ సూపరెండెంట్ కట్ట మంజులాదేవి తెలిపారు. ఈ నెలలో వచ్చే బాల బాలికలు ఆధార్ కార్డ్, ఫోటోతో సంప్రదించాలని సూచించారు. విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు.



శాస్త్రీయ నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు



యోగా నేర్చుకుంటున్న విద్యార్థులు

నరసింహ నవరాత్రోత్సవాలు ప్రారంభం



స్వామి వారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

ధర్మపురి, మే 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో నృసింహ నవరాత్రోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభం అయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 5-30 గంటలకు అర్చకులు మంగళవాయిద్యాలు వెంట రాగా గోదావరి నదికి బయలుదేరి వెళ్లారు. గోదావరి నదిలో పూజలు నిర్వహించిన అనంతరం అక్కడి నుంచి బిందె తీర్థం తీసుకువచ్చారు. అనంతరం ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సహస్ర కలశ స్థాపన, నవగ్రహ, యోగినివాస్తు, క్షేత్ర పాలక స్థాపనలు, అర్చనాది ఆరాధన, హారతి, నిత్య హోమం, నిత్య కల్యాణం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామి వారిని దర్శనం చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఈవో సంకటాల శ్రీనివాస్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సంగనభట్ల దినేష్, ఏఎంసీ చైర్ పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, ధర్మకర్తలు అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



స్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

ధూప దీప నైవేద్య పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన దేవాలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింపజేసేందుకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ డైరెక్టర్ ఎస్ వెంకటరావు నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఉమ్మడి జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ నాయిని సుప్రియ ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన ఆయా ఆలయాలకు నెలకు నాలుగు వేల రూపాయలు ధూప దీప, నైవేద్యాలకు, అర్చక గౌరవ భృతి కింద ఆరువేల రూపాయలు చెల్లిస్తారని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను పాత జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయంలో మాత్రమే ఈ నెల 25వ తేదీ లోపు సమర్పించాలని, వివరాలకు, దరఖాస్తు ఫారం కోసం దేవాదాయశాఖ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వినూత్న బోధన



- పిల్లల్లో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం
- బొమ్మలు, ఇతర సామగ్రితో పాఠాలు

తిమ్మాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మొన్నటి దాకా అంగన్‌వాడీ కేంద్రాలంటే పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పోషకాహారం అందించడమే. కానీ ఇప్పు డు పిల్లలకు ఆటపాటలతోపాటు చదువు నేర్పే కేంద్రాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రస్తుతం రెండున్నర సంవత్సరాలు పూర్తి చేసుకున్న బాలబాలికలకు అంగన్‌వాడీల్లో ప్రవేశం కల్పిస్తున్నారు. వారికి అంకెలు, అక్షరాలు, ఆటపాటలతో కూడిన విద్య అందిస్తున్నారు.

● నూతన పాఠ్యాంశాలు

ప్రైవేట్ పాఠశాలల్లో విధంగా పిల్లలు ఒత్తిడికి గురికాకుండా ప్రభుత్వం స్నేహపూర్వక వాతావరణంలో చిన్నారులకు విద్యతోపాటు పోషకాహారం అందించేలా అంగన్‌వాడీ కేంద్రాలను తీర్చిదిద్దుతోంది. దీనికోసం ప్రభుత్వం పూర్వ ప్రాథమికవిద్య బలోపేతమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. పిల్లల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా ఆటపాటలతో కూడిన బోధనను అందించేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఆంగ్లమాధ్యంలో కొత్త అంశాలు, పాఠ్యాంశాలతో ప్రియదర్శిని పుస్తకాన్ని ప్రవేశపెట్టారు. ఆటపాటలు, బొమ్మలు, ఇతర సామగ్రి ద్వారా పిల్లలో అభ్యాసంపై ఆసక్తి పెరిగే విధంగా కృషి చేస్తున్నారు. దీంతో పిల్లలకు విద్యపై ఆసక్తిని పెరగడమే కాకుండా అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛందంగా వస్తారు.

● అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ..

ఇప్పటికే అంగన్‌వాడీ టీచర్లకు ప్రీస్కూల్ విద్యలో శిక్షణ ఇచ్చారు. దీని ద్వారా వారు చిన్నారులకు నాణ్యమైన విద్యను అందించే వీలుంటుంది. శిక్షణ ద్వారా అంగన్‌వాడీలకు నూతన విద్యా



అట్టముక్కలు, పేపర్లతో తయారు చేసిన ఇల్లు, చెట్లు, పరిసరాలు, బొమ్మలు

ప్రమాణాలపై పట్టువస్తుంది. ఎందుకంటే ఉపాధ్యాయుల్లో చాలామంది పది, ఇంటర్మీడియట్ చదివిన వారే ఉండడం, వారికి ఆంగ్ల బాష మీద పట్టు లేకపోవడంతో శిక్షణ వారిక ఎంతో ఉపయోగపడుతుంది.

● ఆటపాటలతో..

మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో నెలకో అంశాన్ని తీసుకొని విద్యార్థులకు బోధిస్తున్నారు. అదికూడా పనికి రాని వస్తువులు తీసుకొని వాటితో పలురకాలుగా విద్యార్థులకు నిత్యజీవితంలో ఉపయోగపడి, చూసే వాటిని తయారు చేయడం వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. పూల నుంచి వెలువడే సువాసనలు, పూల రంగులు, వాటి ఆకారం గురించి పిల్లలకు చూపిస్తు బోధిస్తున్నారు.సొంతంగా పలు రకాల పండ్లను అట్టలతో తయారు చేయడం వల్ల వారిలో పండ్ల రకాలు, వాటిలో లభించే పోషక విలువలు, వాటి రంగులు, వాటి ఆకారాలు తెలియజేస్తున్నారు. మట్టితో కూరగాయలు, పండ్లు తయారు చేయించడం వాటికి రంగుల వేయించడం చేస్తున్నారు. పాలడబ్బాలతో, పేపర్‌తో క్యాలెండర్, గడియారం తయారు చేయించడం వాటిని చూపించి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష్ అక్షరాలను ఇసుకతో, చింత గింజలతో పేర్చడం ద్వారా అక్షరాలను చూపెడుతూ నేర్పిస్తున్నారు.పిల్లలకు వాహనాల గురించి తెలిపేందుకు ఏ వాహనం ఎలా ఉంటుందో, ఆ వాహనాం ఎలా నడుస్తుందో మట్టితో తయారు చేయిస్తూ పిల్లలకు తెలుపుతున్నారు. చిన్ననాటి నుంచే ట్రాఫిక్‌పై అవగాహన కల్పించేందుకు ప్లాస్టిక్ టీకప్పులతో ట్రాఫిక్‌లైట్లను, సిగ్నల్స్‌ను తయారు చేసి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. అట్ట ముక్కలు, పేపర్స్, దూది, మట్టి, గడ్డి, గాజు తదితర వస్తువులతో వివిధ శరీరభాగాలను తయారుచేసి పిల్లలకు అవయవాల గురించి తెలియజేస్తున్నారు. కుటుంబం అంటే ఏంటి అందులో ఉండే వ్యక్తులు అమ్మ, నాన్న, ఇల్లు, రక్త సంబంధీకులు గురించి అవగాహన కల్పిస్తున్నారు. జంతువుల బొమ్మలు తయారు చేసి వాటిపై అవగాహన కల్పిస్తున్నారు.

సొంతంగా తయారు చేసిన ఉపకరణాలతో బోధిస్తున్నాం..

- శ్రీమతి, సీడీపీవో, కరీంనగర్ రూరల్..



గతానికి భిన్నంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యబోధన జరుగుతోంది. పిల్లల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు రావాలనే ఆసక్తి పెరిగింది. ఆహ్లాదకరమైన వాతవరణంలో ఆడుతూ, పాడుతూ విద్యబుద్ధులు నేర్చుకుంటున్నారు. చిన్ననాటి నుంచే సమాజంపై పిల్లలకు ఒక అంచనా ఏర్పడుతోంది. అంగన్‌వాడీ టీచర్లు పిల్లలతో వస్తువులను తయారు చేయించడం వాటిపై అవగాహన కల్పించడం చేస్తున్నారు. నెలకో కొత్త అంశాన్ని పిల్లలకు నేర్పిస్తున్నారు.





▼▲ వివిధ రకాల బొమ్మలు



మన ఊరు తెలియజేసే విధంగా మట్టి, వివిధ వస్తువులతో తయారు చేసిన అంశం

రాష్ట్రస్థాయి అన్నమయ్య కీర్తనల పోటీలు

-విజేతలకు బహుమతులు అందజేసిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి



విజేతలతో ముఖ్య అతిథి, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): లీడ్ ఇండియా నేషనల్ క్లబ్, స్వరమాధురి సంస్థలు సంయుక్తంగా కరీంనగర్‌లోని సప్తగిరి కాలనీ కోదండరామాలయంలో శనివారం రాష్ట్రస్థాయిలో అన్నమాచార్య కీర్తనల పోటీలు నిర్వహించారు. విజేతల బహుమతి ప్రదానోత్సవానికి సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పోటీలు జరిపిన నిర్వాహకులకు, పాల్గొన్న వారికి అభినందనలు తెలిపారు. విజేతలకు బహుమతులు, ప్రశంసాపత్రాలు ప్రదానం చేశారు. లీడ్ ఇండియా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ బి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ 10 జిల్లాల నుంచి 200 మంది పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. స్వరమాధురి సంస్థ అధ్యక్షుడు కేబీ శర్మ, సాహితీవేత్త డాక్టర్ గంద్ర లక్ష్మణరావు అన్నమయ్య జీవితం, సంకీర్తనల సారం అంశాలపై మాట్లాడారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతుల కింద సబ్‌జూనియర్స్ విభాగంలో నిధిచంద్రిక, భవిష, అనిరుధ్, జూనియర్స్ విభాగంలో అభిరాం, సింధుశ్రీ, సీనియర్స్ విభాగంలో భాస్వంత్‌శర్మ, సుష్మిత, జ్యోతి, సూపర్ సీనియర్ విభాగంలో సుదర్శన్, శంకర్, సుధాకర్ బహుమతులు అందుకున్నారు.

నకిలీ గల్ఫ్ ఏజెంట్‌పై కేసు నమోదు

జగిత్యాల అర్బన్, మే 3 (ఆంధ్రజ్యోతి): సారంగాపూర్ మండలం రంగపేట గ్రామానికి చెందిన దండుగుల నవీన్ అనే నకిలీ గల్ఫ్ ఏజెంట్‌పై శనివారం కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం..

దండుగుల నవీన్ అనే యువకుడు జగిత్యాల పట్టణంలోని జమ్మి గద్దె ప్రాంతంలో ఎలాంటి అనుమతి లేకుండా లక్ష్మీ ట్రావెల్స్‌ను ఏర్పాటు చేశా డు. ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అమాయకులను విదేశాలకు పంపిస్తానని మోసం చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. దీంతో జగిత్యాల పట్టణ ఎస్ఐ గీత ఆధ్వర్యంలో సిబ్బంది లక్ష్మీ ట్రావెల్స్‌కు వెళ్లి తనిఖీ చేశారు. నవీన్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా ఒక గది అద్దెకు తీసుకుని అమాయకులను విదేశాలకు పంపిస్తానని మోసగిస్తున్నాడని విచారణలో తేలింది. దీంతో సుమోటోగా కేసు నమోదు చేసినట్లు సీఐ వేణుగోపాల్ తెలిపారు.

అంతర్జాతీయంగా పాక్ ఒంటరి

- సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ





మాట్లాడుతున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, సమావేశంలో పాల్గొన్న ప్రజలు

కరీంనగర్ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా పాక్ ఒంటరిగా మిగిలిందని, భారత్ స్నేహహస్తం అందిస్తుంటే పాక్ మాత్రం దుర్బుద్ధితో దాడిచేయడం గర్హనీయమని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో శనివారం కరీంనగర్ బృందావన్ గార్డెన్‌లో 'పహల్గాం ఘటనా అనంతరం భారత్ వ్యూహాత్మక అడుగులు-పరిణామాలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ప్రధాన వక్తగా హాజరై మాట్లాడారు. కాశ్మీర్ భారత్‌లో ఎప్పటికీ అంతర్భాగమేనని అన్నారు. దేశానికి ఒకే రాజ్యాంగం, చట్టం ఉంటుందని దాన్ని ఎవరూ చెరిపేయలేరని అన్నారు. సుప్రీంకోర్టు కూడా ఆర్టికల్ 370 రద్దును సమర్థించిందని గుర్తుచేశారు. కాశ్మీరులో జరుగుతున్న అభివృద్ధి ని చూసి పీవోకేలోని యువత తాము భారత్ వాసులమేనని ఉద్యమాలు చేయడం, ఇటీవల పాక్‌కు అమెరికాకు సంబంధాలు చెడిపోవడం, పాక్ ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవడంతో అక్కసును భారతదేశంపై చూపించడం జరిగిందని అన్నారు.

గల్ఫ్ దేశాలు కూడా భారత్‌తో సత్సంబంధాలు నెరపడం కొందరికి మింగుడు పడటం లేదని తెలిపారు. నేడు అంతర్జాతీయంగా పాక్ ఒంటరి అయిందని అన్నారు. తాలిబన్లు, ఇరానియన్లు, ప్రపంచమంతా భారత్ వైపే ఉండటం, పాక్‌లో ఆహార కొరత, అక్కడి ప్రజల నుంచి ప్రభుత్వానికి వ్యతిరేకత రావడంతో వీటన్నిటిని డైవర్ట్ చేసేందుకు మతం ఆధారంగా ఉగ్రవాదాన్ని రెచ్చగొట్టి అమాయక ప్రజల ప్రాణాలు బలిగొన్నారని అన్నారు. ప్రధాని మోదీ విమానాశ్రయంలోనే వివిధ సైన్యాధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేసి ఒక ధైర్యాన్ని నింపడం గొప్ప విషయమని అన్నారు. పాక్‌ను అష్టదిగ్బంధనం చేయడం యుద్ధ నీతిలో ఒక భాగమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గాజుల రవీందర్, డాక్టర్ ఎల్ రాజభాస్కరరెడ్డి, డి నిరంజనాచారి, బీఎస్ శర్మ, సముద్రాల నాగేశ్వరరావు, మందల నగేశ్‌రెడ్డి, జె సత్యనారాయణరెడ్డి, దేశిని శ్రీనివాస్, వెచ్చ మురళి, డాక్టర్ చక్రవర్తుల రమణాచార్యులు, ఎలగందుల సత్యనారాయణ, నగరవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నవ్వు ఓ వరం..

● నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

కరీంనగర్ కల్చరల్/సిరిసిల్ల, మే 3 (ఆంధ్రజ్యోతి) : నవ్వడం ఒక యోగం... నవ్వించడం ఒక భోగం... నవ్వకపోవడం ఒక రోగం... అంటారు పెద్దలు. ఎంతటి శత్రువునైనా నవ్వుతో పలకరిస్తే జయించవచ్చు. నవ్వు వ్యక్తి ముఖ కవళికలు, భావోద్వేగాలపై ప్రభావం చూపుతాయి. వరంలాంటి నవ్వు



నిండు ముఖానికి ఎంతో అందం, ఆనందం, ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది.నేటి యాంత్రిక జీవితంలో నిత్యం ఎంతో కొంతసేపు నవ్వితేగాని ఆయుష్షు, ఆరోగ్యం, ఆనందం, ప్రేమ, అభిమానాలు అందవు. ఈ దిశలో నవ్వు ప్రాధాన్యాన్ని తెలిపే ప్రపంచ నవ్వుల దినోత్సవాన్ని ప్రతీయేటా మే నెల మొదటి ఆదివారం జరుపుకుంటారు.

● నేపథ్యం...

ఈ దినోత్సవాన్ని మొదట్లో జనవరి రెండో ఆదివారం జరుపుకునే వారు. చాలా దేశాల్లో జనవరిలో చలి వాతావరణం ఎక్కువగా ఉండడంతో ఈ తేదీని మార్చాలని నవ్వుల ప్రియులు కోరారు. లాఫ్టర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఈ దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మే నెల మొదటి ఆదివారం నిర్వహించాలని నిర్ణయించారు. స్లీవ్ విల్సన్ అనే మనస్తత్వ శాస్త్రవేత్త మొదట తన వృత్తిలో భాగంగా హాస్యానికి మానవుల మానసిక ప్రవృత్తికిగల సంబంధాల మీద పరిశోధనలు చేస్తూ వర్క్‌షాప్‌ను నిర్వహించాడు. 1997లో ఇండస్ ఫౌండేషన్ అనే భారతీయ సంస్థ టూ క్రియేట్ ఏ పాజిటివ్ వర్కింగ్ ఎన్విరాన్‌మెంట్ అనే అంశం మీద ప్రసంగించడానికి భారత్‌కు ఆహ్వానించింది. అప్పటికే ముంబాయిలో జూహు బీచ్ లాఫ్టర్స్ క్లబ్ డాక్టర్ మదన్ కతారియా నెలకొల్పాడు. ఈ క్లబ్‌ను హాస్య యోగా అని పిలిచారు. 1998 జులైలో విల్సన్‌తో కలిసి వరల్డ్ లాఫ్టర్ టూర్‌ను నిర్వహించారు. దీంతో నవ్వుల దినోత్సవానికి అంతర్జాతీయ ప్రచారం లభించింది. డెన్మార్క్ రాజధాని కోపెన్‌హాగేన్ 2000 జనవరి తొమ్మిదిన నిర్వహించారు. ఈ ఉత్సవం గిన్నిస్‌బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్‌లో నమోదైంది. దీంతో మొదట జనవరిలో నిర్వహించిన నవ్వుల దినోత్సవం 2004 నుంచి మే మొదటి ఆదివారానికి మార్చారు. నవ్వుల యోగా ఉద్యమం ప్రస్తుతం 115 కంటే ఎక్కువ దేశాల్లో నిర్వహిస్తున్నారు. ఆయా దేశాల్లో వేలాది లాఫింగ్ క్లబ్‌లను నిర్వహిస్తున్నారు.

● నవ్వుతో ప్రయోజనాలు

నవ్వు మన శరీరంలో సానుకూల రసాయనాలను విడుదల చేస్తుంది. మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఒత్తిడిని తగ్గిస్తుంది. సంతోషంగా ఉండేందుకు సహకరిస్తుంది. ప్రపంచ శాంతి పెంపొందించేందుకు తోడ్పడుతుంది. గాఢమైన నవ్వు లోతైన శ్వాసను ఉత్తేజపరచి ఆక్సీజన్ ప్రవాహం పెంచుతుంది. కండరాలను సడలించడానికి కారణమౌతుంది. రోగ నిరోధక శక్తి పెంచుతుంది. నిరాశా భావాల్ని ఎదుర్కోవడంలో సహకరిస్తుంది. విభిన్న సంస్కృతులు, నేపథ్యాల ప్రజలను ఏకం చేస్తుంది.

● జరుపుకునే విధానం...

ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో సమావేశమై నవ్వుతూ యోగాభ్యాసం చేస్తారు. కుటుంబ సభ్యులతోపాటు బంధువులు, స్నేహితులు, సహచరులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు, ఎవరైనా వ్యక్తులు పరస్పరం కలుసుకున్నపుడు నవ్వుతూ మాట్లాడుకోవడం కూడా ఓ పద్ధతి. అందుకే నవ్వుల యోగా సెషన్‌లు, కామెడీ షోలు, నవ్వుల ఫ్లాష్ మాబ్స్, నవ్వుల నేపథ్య పార్టీలు, నవ్వుల పవాళ్ళు, నవ్వుల వర్క్‌షాప్‌లు జరుపుకుంటారు.

విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి

గణేశ్‌నగర్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని, డిగ్రీ పరీక్షలు వాయిదా పడుతున్నా పట్టించుకోవడం లేదని, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలపై రేవంత్‌రెడ్డి మాటలు ఉత్తవే అని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్‌లోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అప్పులు తెచ్చి కళాశాలలు నిర్వహిస్తున్నామని ఫీజు బకాయిలు విడుదల చేసే వరకు సెమిస్టర్ పరీక్షలు నిర్వహించబోమని ప్రైవేటు కళాశాలలు ప్రకటించాయన్నారు. ఇప్పటికే యూనివర్సిటీల్లో పరీక్షలు వాయిదా పడ్డా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పరీక్షలు సరైన సమయంలో జరగకపోతే విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే డిగ్రీ కళాశాల యాజమాన్యాలతో చర్చలు జరిపి ఫీజు బకాయిలు విడుదల చేసి పరీక్షల నిర్వహణ జరిగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్‌రెడ్డి, వినయ్, శ్రవణ్, రాజేష్, శివ తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



రాజరాజేశ్వరస్వామివారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

వేములవాడ కల్చరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతర ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయం భక్తులతో సందడిగా మారింది. భక్తులు తెల్లవారుజామున ఆయా క్యూలైన్‌ల ద్వారా ఆలయంలోకి చేరుకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. అనంతరం సంకల్పపూజతో పాటుగా శివకల్యాణ పూజ పరివార దేవతాలయాల్లో భక్తులు ప్రత్యేకపూజలో పాల్గొన్నారు. రాజన్నకు కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయాధికారులు, ఉద్యోగులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అంజన్న ఆలయంలో కోలాహలం..

మల్యాల, మే 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో అభిషేక పూజలు చేశారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు పర్యవేక్షించారు.

అన్నదానానికి రూ. లక్ష విరాళం

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి స్వామి వారి భక్తులు హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన ఇనుకొండ చంద్రరెడ్డి కుటుంబసభ్యులు లక్ష రూపాయల విరాళం అందించారు. ఈ మేరకు అన్నదాన నిర్వహకులు రాజేందర్‌రెడ్డి, రవిందర్‌కు విరాళం సొమ్ములు అందించగా వారు రశీదు అందించారు.



కొండగట్టులో నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న భక్తులు

విద్యార్థులు

అన్నిరంగాల్లో రాణించాలి

రాయికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయుడు ముక్కాల మోహన్ రెడ్డి అన్నారు. మండలంలోని మైతాపూర్ ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 549 మార్కులు సాధించిన పారిపెల్లి సుప్రజ, స్ఫూర్తి, నేహాలతో పాటు విద్యార్థులకు ఆన్‌లైన్‌లో మెమోలు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేముల మధు, కల్వకోట కార్తీక్, సిద్దె గంగరాజం, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం

భీమారం, మే 3 (ఆంధ్రజ్యోతి): భీమారం మండలంలోని రాగోజీపేటకు చెందిన చిలువేరి విదుష పదో తరగతిలో 568 మార్కులతో మండల టాపర్‌గా నిలిచింది. అలాగే 500 మార్కులకు పైగా మార్కులు సాధించిన ఎనుగంటి ఆకాంక్ష, తొగరి నైనిషలను మాజీ సర్పంచ్ బాలసాని లహరికమారుతి గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీడీసీ సభ్యులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి రక్తదానం

రాయికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో ఓ రోగికి తక్షణ అవసరం నిమిత్తం రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కుషనపెల్లి అశోక్ అనే యువకుడు రక్తదానం చేశాడు. దీంతో ఆస్పత్రి సిబ్బంది, రోగి కుటుంబభ్యులు అశోక్‌కు ధన్యవాదాలు తెలిపారు.

'అమృత్ జల్' నిర్మాణ పనులు వేగవంతం చేయాలి


పనులను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

ధర్మపురి, మే 3 (ఆంధ్రజ్యోతి): అమృత్ జల్ పథకం కింద నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్ పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు.. ధర్మపురి పట్టణంలోని వెజ్ నాన్ వెజ్ సమీకత మార్కెట్ సముదాయాన్ని, అమృత్ జల్ పథకం కింద చేపట్టిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ గత ప్రభుత్వ పాలకులు అనాలోచిత నిర్ణయాల వల్ల మార్కెట్ నిర్మాణం సరిగా లేక ఎవరూ వాడటం లేదని అన్నారు. ఈ విషయమై మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీతో మాట్లాడామని, అధికారులతో చర్చించి ప్రజల అభిప్రాయానికి అనుగుణంగా గద్దెలు కూల్చాలని చెప్పాని ఆయన తెలిపారు. అమృత్ జల్ స్కీమ్ కింద నిర్మాణంలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. డబ్బా నీటి పైన ఆధారపడకుండా ప్రత్యామ్నాయంగా బోల్ చెరువు నుండి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ధర్మపురి ప్రాంతానికి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ కమీషనర్ కల్లెడ రాజశేఖర్, పబ్లిక్ హెల్త్ మున్సిపల్ ఈఈ సంపత్ రావు, డీఈఈలు వరుణ్‌రాజ్, ఏఈఈ ధర్మరాజు, వినయ్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చిలుముల లక్ష్మణ్, మండల యువజన కాంగ్రెస్ అప్పం తిరుపతి, అక్కపెల్లి రాజేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ సీపతి సత్యనారాయణ, మున్సిపల్ మేనేజన్ బాలె గంగాధర్, సానిటీరీ ఇన్స్‌పెక్టర్ చిట్యాల గంగాధర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

● నరసింహుడి సన్నిధిలో పూజలు

నరసింహ నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం సందర్శించారు. ఆలయం వద్ద వేదపండితులు, అర్చకులు ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ మంత్రోచ్ఛరణల మధ్య ఆలయ ముఖ్య అర్చకులు నంబి శ్రీనివాసాచారి, అర్చకులు ఆయనను ఘనంగా ఆశీర్వదించారు. అలాగే ఆయనకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ కలిసి స్వామి శేష వస్త్రం కప్పి, ప్రసాదాలు అందించి ఘనంగా సన్మానించారు.

'సమస్యలు పరిష్కరించాలి'

ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వంతో చర్చించి, సిద్ధించుట కోసం కృషి చేయాలని తెలంగాణ ఉద్యోగ జేఏసీ జగిత్యాల జిల్లా అధ్యక్షులు మిర్యాల నాగేందర్‌రెడ్డి, జిల్లా కన్వీనర్ కందుకూరి రవిబాబు కోరారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను శనివారం తెలంగాణ ఉద్యోగ జేఏసీ పక్షాన మర్యాద పూర్వకంగా కలిసి ఉద్యోగుల పెండింగ్ సమస్యలు, ప్రయోజనాలకు సంబంధించి వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో ధర్మపురి మండల తహసీల్దార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కృష్ణచైతన్య, రెవెన్యూ ఉద్యోగుల మాజీ అధ్యక్షులు, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షులు హరి అశోక్‌కుమార్ కో చైర్మన్లు ఎండీ వకీల్, మచ్చ శంకర్, చంద్రయ్య, రాంరెడ్డి, గంగరాజం, హరి అశోక్‌కుమార్, తుంగూరి సురేష్, గంగనర్సయ్య, అత్తినేని శ్రీనివాస్, పాల్గొన్నారు.

● చలివేంద్రాలు ప్రారంభించిన విప్

ధర్మపురి పట్టణంలోని నంది చౌక్ వద్ద తోట సుశీల జ్ఞాపకార్థం ఆమె కొడుకు తోట శంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు.

● పట్టణంలోని బస్‌స్టేషన్ వద్ద దారుల్‌ఖైర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, మండల ఉపాధ్యక్షులు వేముల రాజేష్, పట్టణ అధ్యక్షులు రాజేష్, సొసైటీ అధ్యక్షులు ఎండీ జహంగీర్, ఓకే అంజద్, హఫీజ్, అహ్మద్, ముష్తీ జుబేర్ పాల్గొన్నారు.

ఆరుతడి పంటలు అంతంతమాత్రమే..!

(ఒకటో పేజీ తరువాయి)

సాగుతో కలిగే ప్రయోజనాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

● తగ్గుతున్న భూసారం

పంట మార్పిడి లేకుండా అంచనాలకు మించి వరిసాగు కారణంగా విద్యుత్ వినియోగం పెరగడంతో పాటు విలువైన భూగర్భ జలాలు అడుగంటుతున్నాయి. ఓవైపు హానికరమైన రసాయన ఎరువులను విచ్చలవిడిగా వాడుతుండగా, మరోవైపు రాయితీతో కూడిన ఎరువులు, విద్యుత్ రూపంలో ప్రభుత్వానికి భారం పడుతోంది. రసాయన ఎరువులు భూమిలో కలవడం, భూగర్భ జలాలు అడుగంటుతుండడంతో రైతులు నీటి జాడ కోసం వందల పీట్ల లోతు బోరు బావులను తవ్విస్తున్నారు. అయినప్పటికీ నీరు రాకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ప్రతి ఏటా భూ సారం కూడా తగ్గుతోంది. వరి పొలాల నుంచి గ్లోబల్ వార్మింగ్‌కి కారణమైన మిథేన్ వాయువు అధికంగా వెలువడుతున్నట్లు శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ


సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న నాయకులు

ఇబ్రహీంపట్నం, మే3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములకుర్తి గ్రామంలో శనివారం నడిమి వాడకట్టు మున్నూరు కాపు సంఘం ప్రాంతంలో నిర్మాణం చేస్తున్న సిసి రోడ్డుకు బిఆర్ ఎస్ నాయకులు సున్నం సత్యం, మాజీ ఉపసర్పంచ్ అసతి పెద్ద రాజులు భుమిపుజ చేసీ పనులు ప్రారంభించారు. కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల డాక్టర్ సంజయ్ మంజూరు చేసిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులు రూపాయలు 4లక్షలతో పనులు చేస్తున్నట్లు నాయకులు తెలిపారు.ఈకార్యక్రమంలో మాలేపు రమేష్,సున్నం రమేష్ ,మాలేపు శంకర్,బోనగిరి రాజరెడ్డి, మాలేపు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా న్యాయమూర్తిని కలిసిన బార్ అసోసియేషన్ సభ్యులు


న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మెట్‌పల్లిటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గం శనివారం జగిత్యాల జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి సి.రత్న ప్రభావతిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు కంతి మోహన్‌రెడ్డి ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కొత్తగా ఎన్నికైన మెట్‌పల్లి బార్ అసోసియేషన్ కార్యవర్గానికి అభినందనలు తెలిపారు. మెట్‌పల్లి కోర్టుకి సంబంధించిన ఎలాంటి పనులు అయినా త్వరితగతిన చేసి పెడతానని హామీ ఇచ్చారు. త్వరలోనే మెట్‌పల్లి కోర్టుని విజిట్ చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోగిటి రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి గజెల్లి రామ్ దాస్ , కోశాధికారి పడిగెల శ్రీనివాస్, స్పోర్ట్స్ కార్యదర్శి బిగుల్ల శంకర్, కల్చరల్ కార్యదర్శి మేడిచెల్మల సుమలత, ఆకుల మానస, కార్యవర్గం సభ్యులు అలాల సత్య నారాయణ, కట్టా నర్సాగౌడ్, మన్నె గంగాధర్, గురిజెల గోపి, గజబీంకర్ వెంకటేష్, బర్ల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'


సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు

కోరుట్ల రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు అన్నారు. శనివారం పట్టణంలోని మార్కెట్ కమిటిలో కమిటి చైర్మెన్ పన్నాల అంజిరెడ్డితో కలిసి కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జు జువ్వాడి నర్సింగ రావు లబ్దిదారులకు చెక్కులను అందించారు. ప్రభుత్వం మంజూరి చేసిన రూ.7,35,500 విలువ గల చెక్కులను లబిదారులకు నర్సింగ రావు అందిచారు. ఈ సందర్భంగా జువ్వాడి నర్సింగ రావు మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాడిన తరువాత ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ నిరేపేదలకు అండగా నిలబడుతుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్ స్వామి అభివృద్ధి కమిటి అధ్యక్షుడు ఎతిరాజం నర్సయ్య, కాంగ్రెస్ నాయకులు తిరుమల గంగాధర్, అన్నం అనిల్ కుమార్, గంగాధర్ గౌడ్, కొంత రాజం, సత్యనారాయన గౌడ్, మచ్చ కవిత, రంజిత్, పుప్పల ప్రభాకర్, ఆడెపు మధు, వెంకటేష్ గౌడ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

బాలయ్య సేవలు మరవలేనివి

మెట్‌పల్లి రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని వేంపేట గ్రామంలోని శ్రీ రామకృష్ణ సంకీర్తన మండలి వ్యవస్థాపకుడు గాజంగి బాలయ్య సేవలు మరవలేనివని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. శనివారం గ్రామంలో బాలయ్య నివాసంలో కటుంబ సభ్యులను పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులర్పించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సంస్కృతి సంప్రదాయాల గురించి వివరిస్తూ ఆధ్యాత్మిక భావన, భగవద్గీత ప్రాముఖ్యతపై అనేక కార్యక్రమాలు చేపట్టిన బాలయ్య సేవలు అభినందనీయమన్నారు. గ్రామంలో ప్రతి శ్రీరామ నవమి వేడుకలలో భాగంగా సీతారాముల కల్యాణం వైభవంగా జరిపిస్తూ ప్రజలు ఆధ్యాత్మిక భావన కలిగి ఉంటే జీవితంలోని సమస్యలను తొలగిపోతాయన్నారు. తద్వారా మంచి గుణాలు అవలంబిస్తాయని చాటి చెప్పిన గొప్ప సమాజాన్ని మంచి మార్గంలో నడిపించిన మహనీయుడు మృతి తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణరావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గాజంగి రాజమల్లయ్య, సురేందర్‌రెడ్డి, మారంపెల్లి రమేష్, కొమ్ముల రాజేశ్వర్‌రెడ్డి, తుమ్మల లింగారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలి

మల్లాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులు తోటి వారికి భవిష్యత్‌లో ఆదర్శంగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ నియోజవక వర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబరిచన నలుగురు విద్యార్థులకు శనివారం మండలంలోని రాఘవపేట గ్రామంలో అందజేసి శాలువలు సన్మానించారు. అనంతరం ముత్యంపేటలోని నీలగిరి పెద్దమ్మను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు మల్లాపూర్ జడ్పీటీసీ జలపతిరెడ్డి, నాయకులు నల్ల రాజన్న, బాపురెడ్డి, నర్సయ్య, రాము, నరేష్, ఏంఈవో దామోదర్‌రెడ్డి, ఏఎంసీ కమిటీ పాలకవర్గం సభ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వృత్తికే కాని వ్యక్తిత్వానికి కాదు

రాయికల్, మే 3 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ అనేది వృత్తికేగానీ వ్యక్తిత్వానికి కాదని జిల్లా అడిషనల్ ఎస్పీ భీంరావు అన్నారు. పోలీస్‌శాఖలో 34 సంవత్సరాలుగా హోంగార్డుగా విధులు నిర్వహించి రాంచంద్రం శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ భీంరావు పూల మాలలు వేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. రాంచంద్రం ఉద్యోగ నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందారని అన్నారు. సుదీర్ఘంగా విధులు నిర్వహించి పదవీ విరమణ చేసిన సేవను మరువలేమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ వేణు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

గొల్లపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం చండోలి గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ శనివారం పరిశీలించారు. ఈ సందరర్భంగా ఆయన ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఏ విధంగా సాగుతుందో పరిశీలించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవలు జరగకుండా వరసగా తూకం వేయాలని ఆదేశించారు.

ఆలయాలతోనే ఆధ్యాత్మికత అభివృద్ధి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

జగిత్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఆలయాల నిర్మాణాలతోనే ఆధ్యాత్మికత అభివృద్ధి చెందుతుందని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం హైద్రాబాద్‌లోని తన నివాసంలో జగిత్యాల జిల్లా కేంద్రంలోని నవ దుర్గ ఆలయ అభివద్ధి పనుల కోసం కోటి రూపాయల మంజూరు పత్రాన్ని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత-సురేష్ దంపతుల ఆధ్వర్యంలో నవదుర్గ సేవా సమితి సభ్యులకు అందించారు. ఆలయ అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్సీ కవితను సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడారు. జగిత్యాల జిల్లా అభివృద్ధికి ఎల్లప్పుడు పాటుపడతానన్నారు. నిధులు మంజూరు చేసినందుకు ఎమ్మెల్సీ కవితకు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంతసురేశ్‌కు నవదుర్గ సేవా సమితి సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కస్తూరి శ్రీనివాస్, అంగారి నాగరాజు, బూస ఉమాపతి, అనుమల్ల వాసు, అంగారి విజయ్ కుమార్, సిరిపురపు జితేందర్, గుండేటి వెంకట రమణ, అనుముల చంద్రం పాల్గొన్నారు.

పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


నంచర్లలో పశువైద్య శిబిరం ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్

పెగడపల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): పశువైద్య శిబిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెగడపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని నంచర్ల గ్రామంలో శనివారం పశువైద్య శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన పశువైద్య శిబిరాలు నిర్వహిస్తూ గాలికుంటు నివారణ టీకాలతో పాటు సాదారణ జబ్బులకు చికిత్సలు అందిస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి హేమలత, పశువైద్య సిబ్బంది ఎండీ మకీన్, గోపాలమిత్ర నర్సయ్య, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నిబంధనలు పాటించాలి

-మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్

మెట్‌పల్లిటౌన్, మే 3(ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ అన్నారు. సోమవారం లోపు వాహనాలకు నంబర్ ప్లేట్లు బిగించుకోవాలని కోరారు. నంబర్ లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా ఆయన తెలిపారు. హెల్మెట్, ట్రిపుల్ రైడింగ్, సెల్ ఫోన్ డ్రైవింగ్ మరియు మైనర్ లు డ్రైవింగ్ చేసినట్లయితే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మైనర్లకు వాహనాలు ఇచ్చిన వారి తల్లిదండ్రుల పైన చర్యలు తీసుకొనే అవకాశం ఉంటుందని వారి తల్లిదండ్రులు గమనించాలని మెట్‌పల్లి ఎస్ఐ కిరణ్ అన్నారు. రోడ్డు సేఫ్టీ నిబంధనలు ప్రజలందరూ పాటించి ప్రమాదాలు జరగకుండా పోలీస్‌లకు సహకరించాలని కోరారు.

ధాన్యాన్ని రైస్ మిల్లుకు తరలించాలి


ధాన్యం కొనుగోలు వివరాలను తెలుసుకుంటున్న కలెక్టర్ సత్యప్రసాద్

కోరుట్ల రూరల్, మే 3 (ఆంధ్రజ్యోతి) : దాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేసి వాటిని వెంటనే రైస్ మిల్లుకు పంపే విధంగా నిర్వహకులు, మండల స్థాయి అధికారులు చర్యలు చెపట్టాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అధికారులకు సూచించారు. శనివారం కోరుట్ల మున్సిపల్ పరిధిలోని ఎఖీన్‌పూర్ గ్రామం శివారులోని సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి దాన్యం కొనుగోలు కేంద్రంను అకస్మికంగా తనిఖీని నిర్వహించి కొనుగోలు వివరాలతో కూడిన రికార్డులను పరిశీలించారు. కొనుగోలు చేసిన దాన్యంను వెంటనే రైస్ మిల్లుకు పంపే విధంగా ఏర్పాట్లను చేసి వెంటనే తరలించాలని అన్నారు. వాతవరణ మార్పులను దృష్టిలో ఉంచుకోని దాన్యం కొనుగోలు వేగవంతంగా పూర్తి చేసి రైతులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి జీవాకర్ రెడ్డి, డిఆర్‌డీఓ రఘువరణ్, డిసీఓ మనోజ్ కుమార్, ఇంచార్జు తహసిల్దార్ ఫారూక్ పాల్గొన్నారు.

'ఎండలతో జాగ్రత్త'

జగిత్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): ఎండలు వడగాలుల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో ప్రజలను కాపాడడానికి అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు సరైన జాగ్రత్తలు పాటించాలని, తెలుపు లేదా పలుచని చేనేత వస్త్రాలు ధరించాలని కోరారు. తలపై టోపి కాని రుమాలు కాని వాడాలని ఉదయం పూటనే బయట పనులు పూర్తి చేసుకోవాలని అన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆసుపత్రికి వెళ్ళాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. ఉష్ణోగ్రత అత్యధికంగా ఉండడం వలన మెదడు మీద ప్రభావం చపుతుందని దాని వలన వణుకు మగత నిద్ర కలవరింతలు, ఫీట్స్ రావడంతో పాటు అపస్మారక స్థితిలోకి వెళ్ళె ప్రమాదం ఉందాన్నారు.అందువల్ల ఎండలను నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు.

● భీమారం: వరిధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలోని పీఏసీఎస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులకు కావాల్సిన ఏర్పాట్లను చేయాలని, తేమ శాతం వచ్చిన ధాన్యాన్ని రైతులు కేంద్రానికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గోలి రవికిరణ్, గిర్దావర్‌లు రాజారాం, కిరణ్ కుమార్, పీఏసీఎస్ సీఈవో జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి


బ్రహ్మానంద స్వామి

కథలాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలం చింతకుంటకు చెందిన గాజ బ్రహ్మానంద స్వామి (28) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఎస్సై నవీన్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లో ఓ ప్రైవేట్ కంపనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బ్రహ్మానందస్వామి సెలవుల నిమిత్తం స్వగ్రామం వచ్చాడు. అయితే శుక్రవారం సాయంత్రం తన స్నేహితులతో కలిసి కారులో గ్రామ శివారులోని ఆలయం వైపు వెళ్లారు. కారు వేగంగా నడపడంతో అదుపు తప్పి సమీపంలోని పొలాల్లోకి దూసుకెళ్లింది. కారు డ్రైవింగ్ చేస్తున్న బ్రహ్మానంద స్వామి తలకు తీవ్ర గాయాలు కాగా వెంటనే హైదరాబాద్‌కు మెరుగైన చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గ మధ్యలోనే బ్రహ్మానందస్వామి మృతి చెందినట్లు తెలిపారు. మరో ఇరువురికి గాయాలయ్యాయన్నారు. శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుని కుటుంబాన్ని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరామర్శించి ప్రగాఢ సానుభూతి వెలిబుచ్చారు.

ప్రధాని చిత్రపటానికి క్షీరాభిషేకం


ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

ధర్మపురి, మే 3 (ఆంధ్రజ్యోతి): దేశంలో జన గణనతో పాటు కుల గణన లాంటి చరిత్రాత్మకమైన నిర్ణయం తీసుకున్న దేశ ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి శనివారం ధర్మపురి పట్టణంలో బీజేపీ అధ్యక్షులు గాజు భాస్కర్ ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. దేశంలో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం చేకూర్చి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేకూరుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు గాజు భాస్కర్, అసెంబ్లీ కో కన్వీనర్ బండారి లక్ష్మణ్, పోగుల గుండయ్య, నలుమాసు వైకుంఠం, పల్లెర్ల సురేందర్, స్తంభంకాడి శ్యాంసుందర్, రాయిల్ల రవికుమార్, తిరుమన్‌దాసు సత్యనారాయణ, సంగి మాధవ్, మండలోజు సూరజ్, దివిటి శ్రీధర్, బాకి అనిల్, తోట శ్రీనివాస్, అప్పం మల్లేష్, వెలగందుల ప్రణీత్, నాగులు, కలకోట రాజు, రాకేష్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

● వెల్గటూర్: జన గణనతో పాటు కుల గణనను చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో శనివారం వెల్గటూర్ మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు గోపతి జనార్ధన్ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు.

ఈ సందరర్భంగా ఆయన మాట్లా డుతూ కుల గణన చేయడం వలన రాజకీయంగా, ఉద్యోగ పరంగా, విద్యాపరంగా వెనుకబడిన కులాలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సంగ వెంకటగిరి, మెరుగు సుభాష్, దేశ్‌ముఖ్, భూమయ్య, సాగర్ పాల్గొన్నారు.

విద్యుత్ మీటర్ల బదలాయింపు హర్షణీయం

కొడిమ్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణుల జీవనోపాధికి వినియోగించే విద్యుత్ మీటర్లను ఫోర్త్ కేటగిరికి బదలాయింపు నిర్ణయం తమకు ప్రయోజనకరమని కొడిమ్యాల మండల విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కంచర్ల శ్రీనివాస్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ రెక్కాడితెగాని డొక్కాడని విశ్వబ్రాహ్మణ కుటుంబాలకు గతంలో విద్యుత్ బిల్లులు చెల్లించడం కష్టతరంగా ఉండేదన్నారు. విశ్వబ్రాహ్మణులు జీవనోపాధికి వినియోగించుకునే మిషన్ల విద్యుత్ మీటర్లను ఫోర్త్ కేటగిరికి బదలాయింపు నిర్ణయం తాము హర్షిస్తున్నామన్నారు. విశ్వబ్రాహ్మణుల ఆర్థిక ఎదుగుదలకు ప్రభుత్వ నిర్ణయం అభినందనీయమన్నారు.

చింతకుంట వాసికి అవార్డు

కథలాపూర్, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతకుంటకు చెందిన శ్రీగద్దె నరహరి అనే వ్యక్తికి అంతర్జాతీయ బుద్ధ శాంతి అవార్డు అందుకున్నారు. ఈ మేరకు అస్సాంలో మైత్రి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ రాష్ట్ర గవర్నర్ లక్ష్మణ్ ప్రసాద్ చేతులమీదుగా అవార్డు అందజేశారు. రాడిసన్ బ్లూ గౌహతిలో దేశంలోని ఏడుగురికి ఈ అవార్డు ప్రదానం చేశారు. శాంతిస్థాపన, సమాజంలో మార్పును కోరుకునే ఆధ్యాత్మికను పెంచడానికి కృషి చేసిందుకుగాను నరహరి ఈ అవార్డుకు ఎంపికయ్యారు. సమాజంలో శాంతిని పెంపొందించడానికి నరహరి చేస్తున్న కృషికి ఫలితం లభించడం హర్షణీయమని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ పేర్కొన్నారు.

టీషర్టుల అందజేత

కొడిమ్యాల, మే 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల మైదానంలో అంబేద్కర్ యూత్ టీం క్రికెట్ క్రీడాకారులు 15 మందికి చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ సమకూర్చిన టీషర్టులను మండల బీఆర్ఎస్ నాయకులు శనివారం అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల నాయకులు వెంకటేష్‌గౌడ్, స్వామి, లక్ష్మారెడ్డి, ప్రభుదాస్, మనోజ్ కుమార్, వెంకటి, చంద్రమోహన్, శ్రావణ్, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.